క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం నాడు బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో..



పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం దశమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అలాగే ఆలయంలోని ఉప ఆలయాలకు అర్చకులు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా తాండ్ర పాపారాయుడి వర్ధంతి



తాండ్ర పాపారాయుడు విగ్రహం వద్ద వస్త్ర దానం చేస్తున్న ఆదపురెడ్డి శ్రీనివాసరావు

సామర్లకోట: బొబ్బిలి వీరుడు తాండ్ర పాపారాయుడి వర్ధంతిని శుక్రవారం బ్రహ్మనాయుడు యువజన సంఘ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆదపురెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక అయోధ్య రామపురం, వెలమ పేటలోని తాండ్ర పాపారాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదపురెడ్డి నాగమణి ఏర్పాటు చేసిన వస్త్రదానంలో పాల్గొని పేదలకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్.మధుసూదనరావు, ధర్మవరపు కృష్ణ, సీతా రామయ్య, బూరెడ్డి శ్రీను, పోతుల శ్రీను, నక్కా జానకిరామయ్య పాల్గొన్ని తాండ్ర పాపారాయుడికి నివాళ్లు అర్పిం చారు.

పథకాల అమలుపై సోషల్ ఆడిట్



మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను ప్రశ్నిస్తున్న డీఆర్పీ రామారావు

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న విద్యా శాఖ పథకాల అమలు తీరుపై సోషల్ ఆడిట్ బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. మండలంలోని కాండ్రకోట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డీఆర్పీ జి.రామారావు బృందం ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలించింది. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన పథకం, పీఎంసీ నిధులు, స్కూల్ గ్రాంట్ వివరాలపై ఆరా తీశారు. విద్యాలర్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల వసతులను పరిశీలించి తుది నివేదికను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిస్తామని బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎంఎస్‌సీ మూర్తి, ఏఎంసీ చైర్మన్ కట్టా దేవి, వైస్ చైర్మన్ శానపల్లి శివ చక్రరావు, ఏఎంసీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణానికి కళలు దోహదం

- రాష్ట్ర స్థాయి నాటక కళాపరిషత్ పోటీల్లో వక్తలు
- ఆలోచింపజేసిన ప్రదర్శనలు
- పాత్రోచిత నటనతో ఆకట్టుకున్న కళాకారులు



నాటక కళా పరిషత్‌ను ప్రారంభిస్తున్న వక్తలు

పెద్దాపురం: మంచి సమాజాన్ని నిర్మించడానికి కళలు దోహదపడతాయని ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గోపు నారాయణమూర్తి, ఆజాద్ నేషనల్ ఆర్మీ అధ్యక్షుడు కొత్తెం కోటి, ఎస్సై మౌనిక పేర్కొన్నారు. మండలం చంద్రమాంపల్లి గ్రామంలో స్నేహ ఆర్ట్స్ ఉభయ తెలుగు రాష్ట్రాల షష్టమ నాటక కళా పరిషత్ పోటీలను శుక్రవారం రాత్రి వారు ప్రారంభించారు. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గోందేశి రాజా అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో వారు మాట్లాడుతూ మానవతా విలువలకు ప్రతిరూపమే నాటకాలని, గ్రామీణ ప్రాంతాల్లో జీవన విధానాలను, సామాజిక సంబంధాలను నాటకాలు, కళారూపాల ద్వారా వ్యక్తపరిచేవారన్నారు. డాక్టర్ ఇందన లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు కొమ్మిరెడ్డి బుజ్జి, రేలంగి బుజ్జి, సీఏ స్వార్ మూర్తి మాట్లాడుతూ సీనియర్ నటులు నాటకాలను బతికించుకుంటూ మంచి సమాజానికి బాటలు వేయాలన్నారు. తొలుత యిందన జయకృష్ణ, ముప్పన రామారావు కళా ప్రాంగణాన్ని వారు ప్రారంభించారు. వారి చిత్రపటాలకు నివాళులు అర్పించగా నాటక కళాకారులకు అతిథుల చేతుల మీదుగా మెమెంటోలను అందజేశారు. అనంతరం కరీంనగర్ చైతన్య కళాభారతి బృందం 'ఖరీదైన జైళ్లు', పాలకొల్లు నుంచి వచ్చిన నటీనట సంక్షేమ సమాఖ్య బృందం 'అనూహ్యం' నాటికలను ప్రదర్శించగా న్యాయ నిర్ణేతలుగా కె.శాంతారావు, జీఎస్ఆర్ స్వామి, డి.రాధాకృష్ణ వ్యవహరించారు. సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, కూనిరెడ్డి అరుణ, ఇందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, వెన్నా పండు, మానేపల్లి రవీంద్ర, గొందేశి సత్యానందం, ప్రజా నాట్యమండలి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా 'ఖరీదైన జైళ్లు'

కరీంనగర్ చైనత్య కళాభారతి బృందం రమేష్ మంచాల దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఖరీదైన జైళ్లు' నాటిక మనుషులను, జంతువులను వేరు చేసేది మనసని వివరించారు. మనిషై పుట్టి దేవుడిచ్చిన మనసును వదలి కేవలం అవయవాలను వినియోగించి బతికేస్తున్నారని, మనసులేని మనుషులెందరో అని కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.



'ఖరీదైన జైళ్లు' నాటికలోని సన్నివేశం

అనూహ్యమైన వ్యూహాలతో కొడుకుల అరాచకాలు..

రెండో నాటికను పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య బృందం తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన 'అనూహ్యం' ప్రదర్శితమైంది. తమ కష్టార్జితాలైన ఆస్తులను కొడుకులు కుటిలత్వంతో దక్కించుకుని తేరగా అనుభవించాలని చూస్తున్నారు. వారు బాధ్యతారాహిత్యం, సోమరితనంతో అడ్డదారులు తొక్కుతున్న పరిస్థితులను వివరిస్తూ తల్లిదండ్రులను ఎలా మోసం చేస్తున్నారనేది ఈ నాటిక అంశంగా ప్రదర్శించారు. నాటిక పర్యవేక్షకుడిగా కత్తుల రామ్మోహనరావు వ్యవహరించారు.

మరచిన వస్తువుల అందజేత



అవుట్ పోస్టు వద్ద గ్యాస్ స్టవ్‌ను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న పోలీసులు

సామర్లకోట: మండల పరిధిలోని ఉండూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు శుక్రవారం ఆటో వెనుకభాగంలో గ్యాస్ సిలిండర్, స్టవ్ మరచి దిగిపోయారు. అనంతరం ఆమె విషయాన్ని గ్రహించి అవుట్‌పోస్టులోని పోలీసులను ఆశ్రయించింది. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి ఆటోను గుర్తించి, ఆటో యూనియన్ ప్రతినిధుల ద్వారా గ్యాస్ స్టవ్, సిలిండర్‌ను తీసుకువచ్చి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి వారు వచ్చాక అందజేశారు. స్థానిక పెన్షన్‌లైన్‌లోని పవన్ కుమార్ గ్యాస్ ఏజెన్సీలో కొత్త కనెక్షన్ తీసుకున్న సమయంలో ఈ సంఘటన జరిగింది.

బాలికల సాధికారతకు అందరూ కృషి చేయాలి

పిఠాపురం: బాలికల సాధికారతకు అందరూ కృషి చేయాలని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ జయరాం అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా పిఠాపురం ఇందిరానగర్ యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ బాలికల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అందరూ బాలికల అభివృద్ధి, సాధికారత, సమానత్వం గురించి చర్చించుకోవాలన్నారు. మన దేశంలో బాలికలకు ఎదురయ్యే సవాళ్లు అనేకం ఉన్నాయని వాటిలో లింగ వివక్ష ప్రధాన సమస్య అని కొన్ని కుటుంబాలు బాలురనే ఎక్కువగా ప్రోత్సహిస్తారని బాలికలకు అవకాశాలు తక్కువగా ఇస్తారన్నారు. విద్యలో తారతమ్యాలు ఉండి బాలికలకు సమానమైన విద్య అందడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని ఆయన అన్నారు. కుటుంబ బాధ్యతలు ఎక్కువవుతున్నాయని చిన్న వయసులోనే బాలికలు ఇంటి పనులు, సోదరుల చదువు కోసం పాఠశాల వదిలి వెళ్లాల్సి వస్తోందన్నారు. మానసిక, శారీరక హింస బాలికలపై ఎక్కువగా జరుగుతోందన్నారు. బాల్య వివాహాలు ఇప్పటికీ కొనసాగడం సిగ్గుచేటని చిన్న వయసులోనే బాలికలను పెళ్లి చేయడం వల్ల వారి చదువులు ఆగిపోతున్నాయన్నారు. ఈ సమస్యలన్నింటినీ అధిగమించాలని బాలికలకు బాలురకు సమానమైన అవకాశాలు కల్పించినప్పుడే బాలికల సాధికారత చేకూరుతుందన్నారు. అందరూ బాలికలకు నాణ్యమైన విద్య అందేలా చూడడం, బాలికల హక్కుల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాలికలపై హింసకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అందరం కలిసి ఈ సమస్యలను అధిగమించి బాలికల సాధికారత కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



ఉప్పాడలో శిక్షణ ఇస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ వెంకటరెడ్డి

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం

కొత్తపల్లి: గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే ప్రభుత్వం లక్ష్యమని ఉల్లాస్ జిల్లా కోఆర్డినేటర్ అనిశెట్టి వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పాడలో ఉన్న మత్స్యకార మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం సంఘాల సభ్యులకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులైన సమాఖ్య సభ్యులు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట చేస్తున్న, ఆయాలు, హెల్పర్లు, నైట్ వాచ్‌మన్, అంగన్‌వాడీ హెల్పర్లు, పంచాయతీ పారిశుధ్య కార్మికులను అక్షరాస్యులుగా మార్చడమేనన్నారు. వారికి బోధనతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ ఆవశ్యకత, క్రియాత్మక అక్షరాస్యతలపై వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తూ మహిళల్లో సాధికారత సాధించడమేనన్నారు. గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ భవనాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు అనిల్, తావుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం

సామర్లకోట: మున్సిపాలిటీ అభివృద్ధి పనులలో భాగంగా స్థానిక మఠంసెంటర్ నుంచి కొత్తూరులోని నిమ్మతోట వరకు నిర్మించే సిమెంట్ రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పరిశీలించారు. రూ.12.19లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడానికి ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఈ నిర్మాణ సమయంలో పాత రోడ్డుకు గుంటలు పెట్టి రోలింగ్ చేసి పనులు చేయాల్సి ఉండగా, రోడ్డు దిగువ భాగంలో క్రషర్ బూడిద వేసి రోడ్డు నిర్మాణం చేస్తున్నారని మాజీ మున్సిపల్ కార్మిక సంఘ అధ్యక్షుడు బిక్కిన శ్రీరంగనాయకులు ఆరోపించారు. పట్టణంలో పలు రహదారులు అధ్వానంగా ఉండగా వాటిని వదలి ఈ పనులు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, మున్సిపల్ డీఈ కె.శశిధర్, ఏఈ రమేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మఠం సెంటర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీవిద్య

వైద్య శిబిరంలో 350 మందికి పరీక్షలు

సామర్లకోట: స్థానిక సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో శుక్రవారం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మండల వ్యవసాయాధికారి ఐ.సత్య ప్రారంభించారు. వివిధ రంగాల్లో పని చేసే కార్మిక కుటుంబాల ఆరోగ్యం కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ రీజనల్ హెడ్ కేఎస్ఆర్ చక్రవర్తి తెలిపారు. జిల్లా పరిధిలోని ఈఎస్ఐ, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు బీపీ, సుగర్, కంటి, చర్మ, కీళ్ల, ఈసీజీ, మహిళా సంబంధ వ్యాధులపై పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 350 మంది వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు డివిజనల్ హెచ్ఆర్ మేనేజరు కె సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసిసోయేషన్ అధ్యక్షుడు పబ్బిసెట్టి దుర్గాప్రసాద్, కోరమండల్ జోనల్ మేనేజరు కీర్తి కృష్ణ, ఈఎస్ఐ వైద్యులు హుస్సేన్, జ్యోతి, కిమ్స్ వైద్యులు జయరామ్, సేవా సంస్థ అధినేత ఎం.కృష్ణంరాజు, వ్యవసాయశాఖ విస్తరణాధికారి ఎన్‌వీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెళ్లి కాలేదని సర్టిఫై చేయలేం

తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట: అనేక మంది వివాహం కాలేదని సర్టిఫికెట్లు కావాలని కోరుతున్నారని, అటువంటివి జారీ చేయడం అసాధ్యమని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ టీటీడీలో పెళ్లి చేసుకోవడానికి పెళ్లి కాలేదనే సర్టిఫికెట్లు కావాలని దరఖాస్తులు వస్తున్నాయని, ప్రస్తుతం అన్ని సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లోనే ఇస్తున్నారని, రెవెన్యూ జాబ్ చార్టులో పెళ్లి కాలేదనే సర్టిఫికెట్ల అంశం లేదన్నారు. ప్రస్తుత రోజులల్లో తల్లిదండ్రులకు తెలియకుండానే పెళ్లిళ్లు జరుగుతున్నాయని, ఇటువంటి రోజులల్లో పెళ్లి కాలేదని సర్టిఫికెట్లు ఇవ్వలేమని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులకు అటువంటి ధ్రువపత్రాలు మంజూరు చేయడానికి అవకాశం లేదని, దరఖాస్తుదారులు గమనించాలన్నారు.

ముగిసిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ

సామర్లకోట: గిరిజనులు నివాసం ఉంటున్న మండలాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ)లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శుక్రవారం ముగిసింది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఉభయ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని 38 మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు పెసా, అటవీ హక్కుల చట్టంపై ఈ శిక్షణ ఇచ్చారు. వారు నేర్చుకున్న అంశాలపై ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. గిరిజనులు తమ హక్కులను పూర్తిగా అనుభవించేలా అధికారులు పని చేయాలని సూచించారు. ఈ అంశాలపై శిక్షణ పొందిన వారు వచ్చే నెల 15 నుంచి ఆయా గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ నెల 28, 29 తేదీల్లో రెండో బ్యాచ్, ఫిబ్రవరి 4, 5 తేదీల్లో మూడో బ్యాచ్‌లతో ఈ శిక్షణ ముగుస్తుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులకు వేణుగోపాల్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్, పంచాయతీరాజ్ జేడీలు శ్రీదేవి, రమణ, డీడీ రామనాథం, ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, ఎం.చక్రపాణిరావు, బి.ఆంజనేయుడు, కేఆర్ నిహారిక, డీఆర్ఎస్ పద్మజ, ఎస్‌కే మొహిద్దీన్ పాల్గొన్నారు.



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు

గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరం

కొత్తపల్లి: మండలంలోని యండపల్లి, పాత ఇసుకపల్లిలో శుక్రవారం కొత్తపల్లి పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో పశుఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 31 వరకూ ప్రతి గ్రామంలో నిర్వహిస్తారన్నారు. ఈ శిబిరాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని ఆయన తెలిపారు. పశువుల ఆరోగ్యానికి చికిత్స, ఉత్పాదకతను పెంచడానికి, చికిత్స వ్యాధులను నియంత్రించేందుకు టీకాలు, పశుపోషణ ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ శిబిరాలల్లో పశువులను పరిక్షించడంతో పాటు శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుంది. ఎదకు రాని, చూడి కట్టని, గర్భకోశ వ్యాధులకు పశువైద్యులతో పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. ఎదకు వచ్చిన పశువులను గుర్తించి లింగ నిర్ధారిత వీర్యం కృత్రిమంగా గర్భధారణ చేయించడం జరుగుతుందన్నారు. మండలంలో నేడు గోర్స, రమణక్కపేట, 27న కుతుకుడుమిల్లి, శ్రీరాంపురం, 28న కొండెవరం, పొన్నాడ, 29న కొమరగిరిలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కనిపిస్తున్న మద్యం సీసాలు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ఆవరణలో నిత్యం పలువురు మార్నింగ్ వాక్ చేస్తుంటారు. అడుగు అడుగునా వారికి మద్యం సీసాలతో పాటు, గర్భ నిరోధకాలు దర్శనమిస్తుండడంతో కొంత ఇబ్బంది పడుతున్నారు. దీనితో పాటు రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఇండోర్ ఆడిటోరియం అద్దాలను ధ్వంసం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇటీవల స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం సందర్భంగా జూనియర్ కళాశాలలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, ఈ విషయమై హెచ్చరించినా మార్పు రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ఆవరణ చుట్టూ ప్రహరీతో పాటు గేట్లు ఉన్నా గోడలు దూకి ఆకతాయిలు గ్రౌండ్‌లోనికి ప్రవేశిస్తున్నారని, దీనిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

ముత్యాలమ్మ ఆలయం వద్ద ట్రాఫిక్ జామ్



సామర్లకోట-కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం వద్ద నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అచ్చంపేట జంక్షన్ 216 జాతీయ రహదారి పనులలో భాగంగా ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల కోసం మెటీరియల్ తీసుకొని వచ్చిన టిప్పర్లు ముత్యాలమ్మ ఆలయం వద్ద బారులుతీరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సదరు కాంట్రాక్టర్ ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణమైంది. సాయంత్రం సమయంలో ఆయా ఫ్యాక్టరీలు, కార్యాలయాలు, కళాశాలల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు వారి వారి గమ్యాలకు చేరుకునే క్రమంలో ఎదురైన ట్రాఫిక్ సమస్యతో వారంతా ఇబ్బందికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లె వాహనాలను అచ్చంపేట ఫ్లైఓవర్ మీదుగా వాహనాలను మళ్లించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఎల్ఐసీ ఏజెంట్లు సంఘటితం కావాలి



కేక్ కట్ చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

పిఠాపురం: ఎల్ఐసీ ఏజెంట్లంతా సంఘటితం కావాలని పిఠాపురం ఎల్ఐసీ ఏజంట్లు యూనియన్ సెక్రటరీ కేవీవీ సత్యనారాయణ అన్నారు. పిఠాపురం ఎల్ఐసీ కార్యాలయంలో శుక్రవారం ఎల్ఐసి ఏజెంట్లు ఏపీపీ ఏజెన్సీ ప్రొఫెషన్ ప్రొటెక్షన్ డే సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి, ఏజెంట్ల వృత్తి పరిరక్షణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 24 దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 14 లక్షల మంది ఎల్ఐసీ ఏజెంట్లు, ఏపీపీ ఏజెన్సీ ప్రొఫెషన్ ప్రొటెక్షన్ డే జరుపుకొంటున్నారన్నారు. జనవరి 24, 1945లో ఎస్ఎస్ అలీ అధ్యక్షతన కోల్‌కతాలో ఏజెంట్ల హక్కుల పరిరక్షణ కోసం వృత్తి రీత్యా ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు దేశావ్యాప్తంగా ఉన్న ఏజెంట్లంతా సంఘటితం కావాల్సిన అవసరం ఉందని చాటిచెప్పి యూనియన్ ఏర్పాటుకి బీజం వేశారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు జనవరి 24 ఏజెంట్ల వృత్తి పరిరక్షణ దినం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. యూనియన్ నాయకులు కె.బెన్నయ్యను సత్కరించారు. కార్యక్రమంలో బీఎస్ ప్రకాశరావు, ఎమ్మెస్ నారాయణ, కె.నాగేశ్వరావు, సీహెచ్ అప్పారావు, సిహెచ్ ప్రసాదరావు, బి.వినోద్‌కుమార్, డిఎస్ఆర్ మూర్తి, డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు టేబుల్ కుర్చీ బహూకరణ

పిఠాపురం: నూతనంగా ప్రారంభించిన పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సొంత భవనానికి దాతలు అవసరమైన సౌకర్యాలను సమకూరుస్తున్నారు. పిఠాపురానికి చెందిన సిద్ధి వినాయక వైష్ణవి జనరల్ స్టోర్స్, గణేష్ మెడికల్స్ అధినేత సీహెచ్‌వీ సుబ్రహ్మణ్య శ్రేష్టి ఒక టేబుల్ కుర్చీని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణికి అందజేశారు. దాత సుబ్రహ్మణ్య శ్రేష్టిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కళాశాలకు అవసరమైన సామగ్రిని దాతలు అందజేస్తున్నారని దాతల సహకారంతో కళాశాలకు, విద్యార్థులకు అవసరమైన సామగ్రి సమకూర్చుకుని కళాశాలను అభివృద్ధి పథంలో నడిపించనున్నట్లు ప్రిన్సిపాల్ ఈసందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టేబుల్ కుర్చీని బహూకరిస్తున్న దాత

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. వనదుర్గమ్మ ఆలయంలో పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.20 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్ ఘనపాఠి, వనదుర్గ ఆలయ అర్చకుడు కోట వంశీ, పరిచారకుడు వేణు, వ్రతపురోహితులు చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు దంపతులు, 50 మంది భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు కుంకుమ పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో, తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం గోపీ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా శ్రావణి



పిఠాపురం: శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా అన్నవరానికి చెందిన లక్కరాజు శ్రావణిని నియమించినట్లు సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు విజయ జనార్దనాచార్యులు తెలిపారు. సేవా సంఘం తరపున జరిగే పలు సేవా కార్యక్రమాలకు ఆకర్షితురాలైనట్లు లక్కరాజు శ్రావణి తెలిపారు. సేవా సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి మూడో తేదీన అన్నవరం శాంతి విద్యానికేతన్‌లో వసంత పంచమి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. సేవా సమితి సభ్యులు ఆమెకు అభినందనలు తెలిపారు.

వేణుగోపాలస్వామి దర్శనంలో నరసింహారావు

పిఠాపురం: స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని శుక్రవారం రాజమహేంద్రవరం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కమాండెంట్ కె.నరసింహారావు దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు విజయ జనార్దనాచార్యులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను వారికి వివరించారు.



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న నరసింహారావు దంపతులు